సాక్షి

గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



కోర్టుల్లో లీగల్ ఎయిడ్.. - 10లో

రెండు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి కోర్టు భవన ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని ప్రారంభించారు.



అంతర్జాతీయ అబాకస్‌లో...

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆన్‌లైన్‌లో పరీక్ష రాసి బహుమతులు గెలుచుకున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం

35.6^0 / 17.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు యథాతథం

విద్యారణ్యపురి: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9 నుంచి నిర్వహించబోతున్న డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో పరీక్షల నిర్వహణపై వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు చేపట్టే విధంగా చూస్తామని పేర్కొన్నారు.

శిక్షణకు వంద మంది నమోదు



కేయూ క్యాంపస్: కేయూలో నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం వంద మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని పోటీ పరీక్షల కేయూ డైరెక్టర్ డాక్టర్ టి.నాగయ్య సోమవారం తెలిపారు. ఇప్పటికే పోటీ పరీక్షల ఉచిత కోచింగ్ క్యాంపస్‌లోని ఫిజిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జీకే, లేటెస్ట్ కరెంట్ అఫైర్స్ అంశాలపై పోటీ పరీక్షల నిపుణులు కె.మధు ఉపన్యసించారని తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో జీకే, కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ఫ్రీ కోచింగ్ క్లాసులు 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

కేయూకు బ్లాక్ గ్రాంట్ రూ.127కోట్లు



కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి బ్లాక్ గ్రాంట్(2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కింద) రూ.127.55కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం 2022–23లో రూ.118.25కోట్లు కేటాయించగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.9.30కోట్లు అదనంగా పెంపుదల చేశారు. బ్లాక్ గ్రాంట్ కేయూ ఉద్యోగులు, అధ్యాపకుల జీతభత్యాల కోసమే. అయితే ఈ నిధులు కూడా సరిపోవని యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నారు. ఎందుకంటే.. రెగ్యులర్ ఉద్యోగులు, అధ్యాపకులతోపాటు కాంట్రాక్ట్, పార్ట్‌టైం లెక్చరర్లు, దినసరి వేతన ఉద్యోగులు, లమ్‌సం, టైం స్కేల్ ఉద్యోగులు కూడా యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. వీరందరికీ కూడా వేతనాలు చెల్లించాలంటే మరిన్ని నిధులు అవసరం పడతాయి. కాగా.. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కోసం రూ.190కోట్లకు పైగా నిధులు అవసరమని యూనివర్సిటీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ.. ప్రత్యేకంగా వీటి కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. అన్ని యూనివర్సిటీలకు కలిపి అభివృద్ధి నిధుల కింద రూ.500కోట్లు కేటాయింపులు చేశారు.

అనుమతులు త్వరగా జారీ చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



హన్మకొండ అర్బన్: జిల్లాలో పరిశ్రమలకు అనుమతులు త్వరితగతిన జారీ చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన కన్వీనర్ హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులతో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల వ్యవధిలో 12 పరిశ్రమలు రూ.8.69కోట్ల పెట్టుబడితో 23 అనుమతులు కోరగా.. 18 అనుమతులు జారీ చేశారని, దీని ద్వారా 90 మంది ఉపాధి లభిస్తుందన్నారు. టీ ప్రైడ్ పథకం ద్వారా 5 యూనిట్లకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.31.50లక్షల పెట్టుబడిపై రూ.14.77లక్షల సబ్సిడీ మంజూరు చేశామన్నారు. దీంతో 10 మందికి ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీటీసీ పురుషోత్తం, గ్రామీణ, పట్టణ ప్రణాళికాధికారి రత్నకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వెంకన్న, ఎల్‌డీఎం శ్రీనివాస్, జోనల్ మేనేజర్ టీఎస్‌ఐఐసీ సంతోష్, డీపీఓ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం

బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం





- సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు
- దేవాదులకు రూ.285కోట్లు.. ఎస్సారెస్పీకి రూ.300కోట్లు
- రూ.750కోట్లతో టూరిజం స్పాట్‌గా కాళేశ్వరం.. స్మార్ట్‌సిటీకి రూ.175.68కోట్లు
- ప్రస్తావన లేని మామునూరు ఎయిర్ పోర్టు.. 'నియో' రైలుకు ఈ'సారీ' మొండిచెయ్యి

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఆచితూచి వ్యవహరించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగానే ఉన్నా.. కేటాయింపుల్లోనే ఇంకొంత స్పష్టత ఉండాల్సి ఉంటుందంటున్నారు. అయితే గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారన్న చర్చ కూడా జరుగుతోంది. సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ బిల్లుల చెల్లింపులతోపాటు పనులు పూర్తి చేసేందుకు, గతేడాది మంజూరు చేసిన మెడికల్ కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ, వరద కాల్వల తోపాటు భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులకు కేటాయింపులు దక్కాయి. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750కోట్లుగా పేర్కొన్నారు. మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ వరకు టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు రెండేళ్ల కిందటే డిజైన్ ఖరారు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు తోడు దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లకు ప్రత్యేక నిధులు ప్రతిపాదించారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేస్తున్న ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రం వాటాగా మ్యాచింగ్ గ్రాంట్లను ప్రకటించింది. అయితే బడ్జెట్‌లో మామునూరు ఎయిర్‌పోర్టు ప్రస్తావనే లేకపోగా, వరంగల్ మెట్రో (నియో) రైలుకు రూపాయి కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ భృతిపైనా స్పష్టత ఇవ్వలేదు.

ఆశల పల్లకిలో దళిత బంధు, 'డబుల్' అర్హులు..

'దళిత బంధు' పథకం కింద బడ్జెట్‌లో పేర్కొన్న నిధులు కేటాయిస్తే ప్రతీ నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున ఈ ఏడాది ఉమ్మడి వరంగల్‌లో 13,200 మందికి లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లా పరిధి 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13,200 కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున వర్తింపజేయనున్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఉమ్మడి జిల్లాలో రూ.1.98లక్షల మంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. ఈ బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించగా.. ఒక్కో నియోజకవర్గానికి రూ.100కోట్ల వరకు ఖర్చు చేసినా.. 12 నియోజకవర్గాల్లో సుమారు 40 వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద రూ.603.76కోట్లు కేటాయించగా.. ఉమ్మడి జిల్లాకు రూ.100కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. పోలీస్ కమిషనరేట్, పోలీస్‌స్టేషన్ల నిర్మాణం, ఆధునికీకరణకు కేటాయించిన నిధుల్లో ఉమ్మడి జిల్లాకు రూ.24కోట్ల వరకు ఉంది. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కింద జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కొనసాగిస్తున్నారు. వంటలు చేసేవారి పారితోషికం రూ.1,000 నుంచి రూ.3వేలకు పెంచగా.. 8,109 మందికి లబ్ధి చేకూరనుంది.

ఊసేలేని మామునూరు, మెట్రో రైలు..

ఉడాన్ 5.0లో మామునూరు ఎయిర్‌పోర్టు రన్నింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఏమాత్రం పట్టించుకోలేదు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడతాయనుకుంటే అడియాసలే అయ్యాయి. వరంగల్ నగరం విస్తరిస్తున్నందున మాస్టర్‌ప్లాన్–2041కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోనియో ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. మూడేళ్లు గడుస్తున్నా నిధుల కేటాయింపు లేదు.

ఆస్పత్రులు, కాలేజీలకు ఫండ్స్..

మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణానికి రూ.1,033కోట్లు కేటాయించగా.. ఇందులో ఉమ్మడి వరంగల్‌లో కొత్తగా కేటాయించిన వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణ పనులు జోరందుకోనున్నాయి. హైదరాబాద్, వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.500కోట్లు కేటాయించింది. వరంగల్‌లో శరవేగంగా సాగుతున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు మరింత ఊపందుకోనున్నాయి. సెంట్రల్ స్పాన్సర్డ్ పథకాల కింద స్మార్ట్‌సిటీలకు స్టేట్ వాటాగా రూ.391.99కోట్ల మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చిన ప్రభుత్వం వరంగల్ స్మార్ట్ సిటీకి రూ.175.68కోట్లు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రూ.300కోట్లు కేటాయించగా.. గ్రేటర్ వరంగల్‌కు రూ.20కోట్లు ఇచ్చారు. ఇదిలా ఉండగా.. మామునూరు వెటర్నరీ సైన్సెస్ కాలేజీకి రూ.20కోట్లు, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి రూ.1.60కోట్లు, మేడారానికి రూ.2.96కోట్లిచ్చారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ కోటా కింద వరంగల్, కరీంనగర్‌లకు కలిపి రూ.16.53కోట్లు కేటాయించారు.

ప్రాజెక్టులకు నిధులు..

నీటిపారుదల రంగానికి రూ.26,885కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ ప్రాజెక్టులకు ఈసారి కూడా నిధులిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో పెండింగ్ పనులతోపాటు మూడో టీఎంసీకి కలిపి రూ.2,614.75కోట్లు కేటాయించారు. జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతలకు రూ.500కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. రూ.285కోట్లిచ్చారు. శ్రీరాంసాగర్ స్టేజ్–1 కింద ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌కు రూ.300కోట్లుగా పేర్కొన్న ప్రభుత్వం స్టేజ్–2కు రూ.20కోట్లిచ్చింది. పూర్వ వరంగల్, కరీంనగర్ జిల్లాలను తాకే ఇందిరమ్మ వరద కాల్వ ప్రాజెక్టుకు రూ.219.39కోట్లు, పీవీఆర్ కంతనపల్లికి రూ.12.04కోట్లు, రామప్ప, పాకాలకు రూ.5కోట్ల చొప్పున, లక్నవరానికి రూ.2 కోట్లు, మల్లూరుకు రూ.కోటి ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టును టూరిజం సర్క్యూట్‌గా మార్చేందుకు రూ.750కోట్లు కేటాయించింది. మేడిగడ్డ నుంచి మల్లన్నసాగర్ వరకు 9 ప్యాకేజీలు 880.24 ఎకరాల్లో విస్తరించే పనులకు 'సార్' ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీ రెండేళ్ల క్రితమే డిజైన్ రూపొందించింది. 15 ప్రత్యేక థీమ్ పార్కులు, ఉద్యానవనాలు ఏర్పాటు చేయనున్నారు.

పల్లెకు పట్టం కట్టిన బడ్జెట్

- వివరాలు 10లో

వ్యాగన్ పరిశ్రమకు గ్రీన్ సిగ్నల్

ఇక రైల్వే హబ్‌గా కాజీపేట జంక్షన్



కాజీపేట రూరల్: మడికొండ–అయోధ్యపురం శివారు గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో రైల్వే వ్యాగన్ పీరియాడికల్ ఓవరాలింగ్(పీఓహెచ్) షెడ్‌తోపాటు రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమను కూడా నెలకొల్పుతున్నట్లు సోమవారం రైల్వే అధికారులు తెలిపారు. ఇటీవల రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని ప్రకటించినట్లు వారు పేర్కొన్నారు. వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను వ్యాగన్ పరిశ్రమ తయారీ కేంద్రంగా మల్టీపర్పస్ ప్రాజెక్ట్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు, ఇందుకు రూ.521కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. వ్యాగన్‌కు 160 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వాన్ని అడుగగా.. 150 ఎకరాలు స్థలం ఇచ్చిందని, వ్యాగన్ పరిశ్రమకు ట్రాక్ కనెక్టివిటీకి 1.5 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు అప్పగించాల్సి ఉందని పేర్కొన్నారు. భారతీయ రైల్వేలో ప్రస్తుతం రైలు బోగీల కంటే వాణిజ్య రవాణాపరంగా వ్యాగన్ల డిమాండ్ బాగుందని, అందుకోసం కాజీపేట పీఓహెచ్‌ను వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. కాగా.. 2009–10 రైల్వే బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ కాజీపేటలో పీపీపీ విధానంతో రూ.200కోట్లతో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను మంజూరు చేశారు. అయితే అనేక కారణాల వల్ల వ్యాగన్ల పరిశ్రమను రద్దు చేశారు. తర్వాత పీఓహెచ్ షెడ్‌ను మంజూరు చేశారు. కాజీపేటకు మొదట్లో మంజూరైన వ్యాగన్‌ల తయారీ పరిశ్రమను తిరిగి నెలకొల్పుతున్నట్లు ప్రకటిచండంతో జిల్లా ప్రజలు, రైల్వే కార్మికులు, నిరుద్యోగుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. వ్యాగన్ల పరిశ్రమ ఇక్కడ నెలకొల్పితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఏదేమైనా అటు రైల్వే శాఖ, ఇటు జిల్లా అధికార యంత్రాగం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పరిశ్రమకు కావాల్సిన స్థలం ఇచ్చేందుకు సిద్ధం చేసి.. నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్‌గా వాసుచంద్ర

హన్మకొండ అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఆర్వో వాసుచంద్రకు అప్పగిస్తూ సీసీఎల్‌ఏ నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అదనపు కలెక్టర్ సంధ్యారాణి తన కుమారుడి వివాహం నేపథ్యంలో ఈనెల 6 నుంచి 28వ తేదీ వరకు 23 రోజులపాటు సెలవు పెట్టారు. దీనిని ఆమోదించిన సీసీఎల్‌ఏ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో డీఆర్వోకు వాసుచంద్రకు అదనపు కలెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



అజయ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఆర్వో వాసుచంద్ర

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతుల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయొద్దన్నారు. ప్రజావాణిలో తహసీల్దార్ ఆఫీసుకు సంబంధించి 19, ఆర్డీఓ హనుమకొండ 7, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 17, డీఆర్వో ఆఫీస్‌కు ఐదుతోపాటు మొత్తం 82 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వాసుచంద్ర, డీపీఓ జగదీశ్వర్, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సబిత, డీఎస్‌సీఓ వసంతలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్‌తో హల్‌చల్

కాగా.. కలెక్టర్ సిక్తా పట్నాయక్ తొలిసారిగా వినతులు స్వీకరిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి హంగామా సృష్టించి అధికారులను పరుగులు పెట్టించినంత పనిచేశాడు. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డి అనే యువకుడు ఓ బాటిల్‌లో ఉన్న ద్రావణాన్ని మీద పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో కలెక్టరేట్ ఏఓ కిరణ్‌ప్రకాష్, ఇతర అధికారులు హైరానాపడి అక్కడికొచ్చారు. కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను చెప్పమన్నారు. సమస్యను విన్న కలెక్టర్ అధికారులతో మాట్లాడారు, బాధితుడి సమస్య పరిష్కారానికి అధికారుల చేతుల్లో ఎలాంటి అవకాశాలు లేనందున కోర్టుకు వెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో బాధితుడు తనపై చల్లుకున్న ద్రావణం ఏమిటని పరిశీలించగా.. కూల్‌డ్రింక్ షాపుల్లో దొరికే పల్పీరెంజ్‌గా అధికారులు నిర్ధారించారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సదరం సర్టిఫికెట్లు సమర్పించాలి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి అంగవైకల్యం, వినికిడి, దృష్టిలోపం, మానసిక వైకల్యం గల అభ్యర్థులు మెడికల్ బోర్డు సర్టిఫికెట్ ఉండి.. సదరం సర్టిఫికెట్ లేని వారు ఈనెల 8లోగా వరంగల్ ఎంజీఎంలో సదరం క్యాంపునకు హాజరై సంబంధిత సదరం సర్టిఫికెట్‌ను తమ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ ఎండి.అబ్దుల్ హై కోరారు. అయితే సోమవారం వరకు కూడా ఎంజీఎంలో సదరం క్యాంపు ఏర్పాటు చేయలేదు. దీంతో దివ్యాంగ ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లి వెనుదిరుగుతున్నారని దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు బిల్ల మహేందర్ తెలిపారు. దీనిని డీఈఓ దృష్టికి తీసుకెళ్లామని, అయితే మెడికల్ క్యాంపు కోసం డీఆర్‌డీఏకు లేఖ పెట్టామని, అంతవరకే మా పరిమితి అని చెప్పారన్నారు. కాగా.. దివ్యాంగుల ఉపాధ్యాయులు తమ సదరం సర్టిఫికెట్లు సమర్పించే తేదీ రెండు రోజులే ఉందని, దీంతో ఎంజీఎంలో మెడికల్ సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని మహేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బాలసముద్రంలో పాదయాత్ర చేస్తున్న షర్మిల



అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..

వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్ర సోమవారం నగరంలో కొనసాగింది. బాలసముద్రం, నక్కలగుట్ట, అదాలత్, కలెక్టరేట్, నిట్, ఫాతిమానగర్ కాజీపేట, మడికొండ మీదుగా పాదయాత్ర సాగింది. - వివరాలు 10లో

'హాథ్ సే హాథ్' జోష్..

మేడారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ పాదయాత్ర షురూ..

- గట్టమ్మ, సాయిబాబా ఆలయాల్లో పూజలు
- సమ్మక్క–సారలమ్మకు ఎత్తు బంగారం సమర్పణ
- పొరుగు జిల్లాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



ప్రాజెక్టు నగర్ నుంచి పస్రా వైపు పాదయాత్రగా వస్తున్న రేవంత్‌రెడ్డి

ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత ములుగు మండలం గట్టమ్మ, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో రేవంత్‌రెడ్డి పూజలు చేశారు. తర్వాత మేడారం చేరుకున్న ఆయనకు ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు స్వాగతం పలికారు. సమ్మక్క, సారలమ్మ పూజారులు డోలు వాయిద్యాల నడుమ అమ్మవారి ముఖద్వారం నుంచి గద్దెల వరకు తీసుకొచ్చారు. అనంతరం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి.. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఆయన ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు.

నినాదాలతో మార్మోగిన మేడారం..

రేవంత్‌రెడ్డి వచ్చిన సందర్భంగా తాడ్వాయి తోపాటు వివిధ మండలాల నుంచి పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు మేడారం తరలివచ్చారు. గద్దెల ప్రాంగణంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న సమయంలో పార్టీ శ్రేణులు రేవంత్ సీఎం అంటూ.. నినాదాలు చేశారు. కొద్దిసేపు గద్దెల ప్రాంగణం అంతా నాయకుల హడావుడి కనిపించింది. ఇటు ఆదివారం భక్తులతో కళకళలాడిన మేడారం.. రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా సోమవారం జన సందోహం కనిపించింది. ఆయన పాదయాత్ర సందర్భంగా మేడారంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడ్వాయిలో ఘన స్వాగతం

పస్రా నుంచి తాడ్వాయి మీదుగా రేవంత్‌రెడ్డి మేడారం చేరుకున్నారు. తాడ్వాయిలో సమ్మక్క ఆర్చీ వద్ద ఆయనకు జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్, సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, రేగ కళ్యాణి, జిల్లా నాయకులు ఆరెం లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, నాయకులు, మహిళలు డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. గజమాలతో రేవంత్‌రెడ్డిని సన్మానించి.. శాలువాతో సత్కరించారు. రేవంత్‌రెడ్డి సాయంత్రం పస్రా నుంచి చల్వాయి వరకు పాదయాత్ర చేస్తున్న సమయంలో స్థానికులు భారీగా స్వాగతం పలికారు.



పస్రాలో ప్రజలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ప్రజాభిమానానికి రుణపడి ఉంటా: ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క

రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిసి ఒక్క పిలుపుతో వేలాదిగా వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజల అభిమానికి రుణపడి ఉంటానని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. రేవంత్‌రెడ్డి వస్తున్నారని తెలిసి పోడుదారులకు హక్కు పత్రాలు ఇస్తామని చాటింపు చేయించడం చూస్తే కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో సీఎంకు అర్థమవుతోందన్నారు. దోచుకుతినే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తారో.. ప్రజలకు న్యాయం చేసే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారో.. తేల్చుకోవాలన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఆదిలాబాద్, చెన్నూరు, నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి, భద్రాచలం, మంచిర్యాల ప్రాంతాల నుంచి వేలాది వాహనాల్లో కార్యకర్తలు తరలిరావడంతో ములుగు సబ్ డివిజన్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వాహనాలు వస్తున్నకొద్దీ పార్కింగ్ స్థలాలను మార్చుకుంటూ వెళ్లారు. కాగా.. తొలిరోజు యాత్ర వెంకటాపురం(ఎం) పాలంపేటలో ముగిసింది. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళి, ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళి, పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మల్లాడి రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాశకు పోతే.. అసలు పోయింది!

● రూ.87,049లు ఖాతా నుంచి మాయం

కాజీపేట: సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన ఓ నిట్ విద్యార్థి అత్యాశకు పోయింది. అసలు పోగొట్టుకుంది. ఈఘటనపై సోమవారం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. నిట్ విద్యార్థి ఫోన్‌కు ఓ లింక్ వచ్చింది. అది ఓపెన్ చేయగా.. తామిచ్చే టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులు ఖాతాలో పడతాయంటూ నమ్మించారు. వీరి మాటలు నమ్మిన ఆవిద్యార్థిని ఓటాస్క్ పూర్తి చేయగానే ఆమె ఖాతాలోకి రూ.330 జమయ్యాయి. మరిన్ని టాస్క్‌లు పూర్తి చేయడానికి యత్నించగా ఆమె ఖాతాలో ఉన్న డబ్బులు మాయమయ్యాయి. ఆతర్వాత ఆమె పోలీసులను ఆశ్రయించింది.

ఇద్దరికి జైలు

కాజీపేట: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మంది వాహనదారులను కోర్టులో సోమవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలు, ఏడుగురికి రూ.12,400 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారు.

కాజీపేట: వాహనానికి నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న వాహనదారుడిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

కోర్టుల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం

కార్యాలయాన్ని ప్రారంభించిన హనుమకొండ, వరంగల్ ప్రధాన న్యాయమూర్తులు


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా 16 జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను సోమవారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వారితో పాటు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.నవీన్‌రావు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి జిల్లాలోని కోర్టు భవన ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం హనుమకొండ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమితులైన డి.శ్రీకాంత్, వరంగల్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమితులైన ఆర్.సురేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.రజినిలను అభినందించారు. పేదవారికి, మహిళలకు, వృద్ధులకు అన్యాయం జరగకుండా చట్టం దృష్టిలో అందరూ సమానులే అనే ఉద్దేశ్యంతో పని చేయాలని సూచించారు. సాయం కోసం వచ్చిన ప్రతివాదుల వాదనలను అర్థం చేసుకొని, న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు జె.ఉపేందర్‌రావు, బి.శ్రీనివాసులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఆనంద్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్డీఓలు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ

● కొనసాగిన వైఎస్ షర్మిల పాదయాత్ర
● భారీగా పాల్గొన్న జనం


ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

హన్మకొండ అర్బన్/కాజీపేట/కాజీపేట రూరల్/చిల్పూరు: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్ర సోమవారం వరంగల్ నగరంలో కొనసాగింది. ఉదయం హనుమకొండ బాల సముద్రంలోని మైదానంలో విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పని తీరు, ఆపార్టీ అధినేత కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. అనంతరం బాలసముద్రం, నక్కలగుట్ట, అదాలత్, కలెక్టరేట్, నిట్, ఫాతిమానగర్ కాజీపేట మీదుగా పాదయాత్ర సాగింది. ఈసందర్భంగా పలువురు పార్టీలో చేరగా.. షర్మిల కండువా కప్పి ఆహ్వానించారు. కాజీపేట చౌరస్తాకు చేరుకున్న షర్మిల ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి ప్రయత్నించగా రహదారులకు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ప్రజల ఇబ్బందులు గుర్తించిన షర్మిల కాజీపేటలో ఎక్కడా మాట్లాడకుండా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మడికొండసెంటర్, రాంపూర్ మెయిన్ రోడ్డు మీదుగా పాదయాత్ర సాగింది. డీజిల్ కాలనీ-మడికొండ మధ్య ఒక దివ్యాంగుడు షర్మిలను శాలువాతో సన్మానించేందుకు రాగా.. అదే శాలువా తీసుకుని షర్మిల ఆ దివ్యాంగుడిని సన్మానించారు. కాగా.. చిల్పూరు మండలం వంగాలపల్లి గ్రామానికి సోమవారం పాదయాత్ర చేరుకున్నారు. ఆమె వెంట వైఎస్సార్ టీపీ నాయకులు నాడెం శాంతికుమార్, పిట్ట రాంరెడ్డి, చల్లా అమరేందర్‌రెడ్డి, కొటిల్‌రెడ్డి, సుమిత్, బోడ్డు శ్రావణ్‌కుమార్, నాగవెల్లి రజినీకాంత్, దుప్పటి ప్రకాశ్, ఎస్.రఘు, గొరబోయిన సమ్మయ్య, ఊరడి శ్రీనివాస్, సంగాల ఈర్మియా, చింతకింది శ్రీహరి, భాస్కర్, దిలీప్, ప్రశాంత్, ఆంజనేయులు, విష్ణు, నరేశ్, మున్నా ఉన్నారు.

పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని వినతి


వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కేయూలోని రిటైర్డ్ ప్రొఫెసర్లకు పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని కేయూ రిటైర్డ్ టీచర్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు (కుర్తా) ప్రొఫెసర్ ఎ.సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ ఇతర బాధ్యులు వీసీ రమేశ్‌ను, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును కలిసి వినతి పత్రం అందించినట్లు అసోసియేషన్ బాధ్యులు సోమవారం తెలిపారు. ఈపీఆర్సీ ఎరియర్స్‌లో కేవలం 25 శాతం మాత్రమే చెల్లించారని మిగతా 75 శాతం ఎరియర్స్‌ను చెల్లించాల్సి ఉందని వీసీ, రిజిస్ట్రార్ల దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రం అందించిన వారిలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, కోశాధికారి జి.వీరన్న ఉన్నారు.

10 నుంచి పీజీ సెకండియర్ ఫస్ట్ సెమ్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో అన్ని పీజీ కోర్సుల సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి సోమవారం తెలిపారు. అన్ని పీజీ కోర్సుల సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10, 13, 15, 17, 20, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపరీక్షల నిర్వహణకు 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అందులో 6,794 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

బావిలో పడి యువతి..


ప్రణీత మృతదేహం

రామన్నపేట: నీళ్లు తోడుతూ బావిలో పడి సోమవారం వరంగల్ నగరం 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కాపరబోయిన ప్రణీత(23) మృతి చెందింది. రామన్నపేటకు చెందిన కాపరబోయిన రవి స్వరూప దంపతులు మహబూబాబాద్ జిల్లాలో తన సోదరుడి ఇంట్లో జరిగే బొడ్రాయి ఉత్సవాలకు వెళ్లారు. ఆదివారం వారి కూతురు ప్రణీత స్నానం చేసేందుకు నీళ్ల చేదడానికి యత్నించి జారి బావిలో పడి మృతి చెందింది. ప్రణీత తమ్ముడు అక్క కోసం వెతకగా జాడ దొరకలేదు. బావిలో వంగి చూడగా ప్రణీత అప్పటికే శవమై తేలింది. ఫైర్ సిబ్బంది ప్రణీత మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

అతిక్రమణలపై వినతులు

● దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్ ప్రావీణ్య


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్: మహా నగరంలో ఖాళీ స్థలాలు, భవన నిర్మాణాల అతిక్రమణలపై గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ ప్రావీణ్య వినతులు స్వీకరించారు. మొత్తం 60 ఫిర్యాదులు రాగా.. వాటిలో 38 ఫిర్యాదులు ఒక్క టౌన్ ప్లానింగ్ విభాగానికి అందడం గమనార్హం. వివిధ మౌలిక వసతుల కల్పన కోసం ఇంజనీరింగ్ విభాగానికి 7, పన్నుల విభాగానికి 6, ప్రజారోగ్యం, శానిటేషన్‌కు 3, తాగునీటి సెక్షన్‌కు ఆరు చొప్పన వినతులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ ఉర్ రషీద్, జోనా, శ్రీనివాస్‌రెడ్డి, బయాలజిస్టు మాధవరెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్, వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని ఇలా..

- హనుమకొండ పోచమ్మకుంటలో ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని గతంలో రెండుసార్లు వినతిపత్రాలు అందజేశామని, ఇంతవరకు ఇవ్వలేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ నెహ్రూ నగర్‌లోని ఇంతిజామి కమిటీ మసీద్‌లో నల్లా కనెక్షన్ ఇవ్వాలని నిర్వాహకులు వినతిపత్రం సమర్పించారు.
- 56వ డివిజన్ పరిమళ కాలనీలో సీసీ రోడుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.
- 55వ డివిజన్ అరుణోదయ కాలనీ రోడ్డు నం.3లో సీసీ రోడ్డు అసంపూర్తిగా నిర్మించారని, పూర్తిస్థాయిలో వేయాలని కాలనీ అధ్యక్షుడు బి.ఆంజనేయులు కోరారు.
- హనుమకొండ జేఎన్ఎస్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వాకర్స్ ప్రతినిధులు ఎల్లయ్య, రమేష్ విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ నక్కలగుట్ట వార్డు కార్యాలయంలోని పబ్లిక్ టాయిలెట్ నిర్వహణను అభ్యుదయ దళిత సొసైటీకి ఇవ్వాలని నిర్వాహకుడు సాంబయ్య కోరారు.
- 2వ డివిజన్ గుండ్ల సింగారం, వంగపహాడ్, పెగడపల్లి, రెడ్డిపురం, 9 ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

నీళ్లనుకొని గడ్డి మందు తాగిన చిన్నారులు

● ఆస్పత్రిలో చికిత్స


మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

కురవి: మండలంలోని మొగిలిచర్ల శివారు జగ్యాతండా(ఎల్‌జే తండా) జీపీలో సోమవారం ఇద్దరు చిన్నారులు మంచి నీళ్లు అనుకుని గడ్డి మందు (కలుపు నివారణ మందు) తాగారు. తండాకు చెందిన లూనావత్ మల్సూర్-అనిత దంపతులకు మూడేళ్ల జయశ్రీ, ఏడాదిన్నర వయసున్న ప్రభాస్ ఉన్నారు. సోమవారం పిల్లల్ని తీసుకుని వారు తమ మిరప తోటకు వెళ్లారు. పిల్లల్ని, మల్సూర్ తమ్ముడి కొడుకును చెట్టు కింద ఆడుకోమని చెప్పి ఆ దంపతులిద్దరూ మిరపకాయలు ఏరుతున్నారు. పిల్లలు ఆడుతున్న చోటే గడ్డి మందు డబ్బాలు, మంచి నీళ్లు ఉన్నాయి. ఈక్రమంలో జయశ్రీ, ప్రభాస్ మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగారు. మల్సూర్ తమ్ముడి కొడుకు సైతం తనకు ఆ డబ్బా ఇవ్వాలని జయశ్రీని అడగ్గా.. ఇవ్వలేదు. దీంతో అతడు ఏడుస్తూ వెళ్లి తోటలో పని చేస్తున్న మల్సూర్, అనితకు డబ్బా ఇవ్వడం లేదనే విషయాన్ని చెప్పాడు. అనుమానం వచ్చిన మల్సూర్, అనిత చెట్టు కిందికి వచ్చి చూసి పిల్లలిద్దరూ గడ్డి మందు తాగినట్లు గుర్తించారు. రోదిస్తూ పిల్లలను మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స విభాగంలో ఇద్దరు చిన్నారులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగానే ఉందని, 24 గంటల తర్వాత ఆరోగ్యస్థితి తెలియజేస్తామని వైద్యులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో భార్య, కొడుకుపై దాడి

నర్సంపేట: కుటుంబ కలహాలతో మండలంలోని చంద్రయ్యపల్లిలో సోమవారం నిడిగొండ కోటిలింగం తన భార్య విజయ, కుమారుడు ప్రమీణ్‌పై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. కోటిలింగం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నిత్యం కుటుంబీకులతో గొడవ పడుతుండేవాడు. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో వారి స్వగ్రామం చంద్రయ్యపల్లి చేరుకుని మాట్లాడుకుంటున్న సమయంలో కోటిలింగం కోపంతో భార్య, కుమారుడిపై ఒక్క సారిగా కత్తితో దాడికి దిగాడు. విజయ గొంతు భాగంలో, ప్రమీణ్ ఛాతిపై తీవ్రంగా గాయపర్చాడు. గమనించిన స్థానికులు వారిని నర్సంపేట ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. కోటిలింగం పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాపర్ దొంగలకు జైలు

వరంగల్ లీగల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరు దొంగలించిన నేరం రుజువుకావడంతో కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన బండి కుమార్, కమలాపూర్‌కు చెందిన దేవరాజుల తిరుపతికి ఆర్నెళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సోమవారం హనుమకొండ నాలుగో మున్సిఫ్ మేజిస్ట్రేట్ జడ్జి మట్ట శ్రీలత తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2019 జూలై నుంచి సెప్టెంబర్ మాసాల్లో వేలేరు మండల పరిధి కన్నారం, ఎర్రబెల్లి, పీసర, సోడాషపల్లి గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూముల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని 100 కేజీల కాపర్ వైర్ (విలువ సుమారు రూ.60 వేలు) గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. విద్యుత్ శాఖ ఏఈ రజిత్‌కుమార్, లైన్ మెన్ వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు వేలేరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో బండి కుమార్, దేవరాజుల తిరుపతిపై నేరం రుజువు కావడంతో వీరికి ఆర్నెళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. పోలీస్ అధికారి వీరభద్రరావు కేసు పరిశోధించగా.. లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి కేసు వాదించారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అబాకస్‌లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు


హన్మకొండ: అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఆన్‌లైన్‌లో అబాకస్ విద్యను అభ్యసిస్తూ ఆన్‌లైన్ అబాకస్ పరీక్ష రాసి వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అలామా ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ జి.ముత్తుకుమార్ వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. కాజీపేటకు చెందిన ఎం.క్రిషవ్‌రాజ్ ప్రథమ బహుమతితో పాటు చాంపియన్ ట్రోఫీ గెలుచుకున్నారని అబాకస్ ట్రైనర్ పి.నరేశ్‌గుప్త తెలిపారు. తొర్రూరుకు చెందిన వి.సుశాంత్, వరంగల్‌కు చెందిన ఎం.సిరిచందన, భూపాలపల్లికి చెందిన బి.సాయి కార్తీక్, హనుమకొండకు చెందిన జశ్వంత్ మాధవ్, ఇతర విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నట్లు వివరించారు.


ఎన్ఐటీ ఎదుట కమ్ముకున్న పొగమంచు

మంచు కురిసే వేళలో..

వరంగల్ మహా నగరాన్ని సోమవారం మంచు కప్పేసింది. అయినప్పటికీ ఉదయాన్నే పనుల మీద వెళ్లే వాహనదారులు, పారిశుద్ధ్య కార్మికులు, చిరువ్యాపారులు రోడ్లపై కనిపించారు. ఉదయం ఏడు దాటినా వాహనదారులు లైట్లు వేసుకునే రాకపోకలు కొనసాగించారు. కాజీపేట రైల్వే జంక్షన్‌లో పొగమంచులోనే గ్యాంగ్‌మెన్లు, ట్రాక్‌మెన్లు, పెట్రోల్‌మెన్లు, కీ మెన్లు విధులు నిర్వహించారు.

– కాజీపేట రూరల్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పొగమంచులో రైలు పట్టాలపై విధులు నిర్వహిస్తున్న రైల్వే కీమెన్

పల్లెకు పట్టం కట్టిన బడ్జెట్

● ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది
● మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


హరీశ్‌రావును సన్మానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

'ఈ బడ్జెట్ పల్లెకు పట్టం కట్టింది. ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణప్రగతి పథంలో పయనిస్తోంది. ఏటేటా బడ్జెట్ నిధులు పెంచుకుంటూ.. ప్రజల సమగ్ర సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. ఇందులో రూ.31,426 కోట్లు కేటాయించి పంచాయతీ రాజ్ శాఖకు సింహభాగం కేటాయించడంపై సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు' అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు ప్రముఖులు స్పందించారు.

– హన్మకొండ/న్యూశాయంపేట/వరంగల్/వర్ధన్నపేట/నర్సంపేట

అరకొర నిధులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు అరకొర నిధులు కేటాయించారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా నిరుద్యోగ భృతిని విస్మరించారు. డబుల్‌బెడ్రూమ్‌ల మాట నిలబెట్టుకోలేదు. ప్రస్తుతం కేటాయించిన నిధులు పాత బిల్లులకే సరిపోవు. గిరిజన బంధు ఊసే లేదు.

– టి.శ్రీనివాస్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

సామాన్యులకు మేలు చేసే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు మేలు చేసే బడ్జెట్. మెనిఫెస్టోలో పొందు పర్చిన అన్ని అంశాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. సంక్షేమానికి పెద్ద పీట వేశారు.

– చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

అన్ని వర్గాలకు అనుకూలమైన బడ్జెట్



రైతులకు అనుకూలమైన వ్యవసాయ బడ్జెట్‌తో పాటు అన్ని వర్గాల పేదలకు, ప్రజలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. ఇళ్లు లేని పేదలకు, దళితులకు ప్రాధాన్యం కల్పించి గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు జరిగే విధంగా నిధులు కేటాయించారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు సీఎం నిధులను కేటాయించడం జరిగింది.

– పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే

'దళితబంధు'కు రూ.17వేల కోట్లు



దళితబంధు పథకానికి రూ.17 వేల కోట్లు కేటాయించడం, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించిన ఈ బడ్జెట్ ఆమోదయోగ్యంగా ఉంది. కేంద్ర సహకారం లేకున్నా స్వశక్తితో ఎదిగి రూ.2.95 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– అరూరి రమేశ్, ఎమ్మెల్యే, వర్ధన్నపేట

అభివృద్ధి, సంక్షేమ బడ్జెట్...



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇది. జర్నలిస్టుల కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటుతో జిల్లాలోని జర్నలిస్టుల కల సాకారం కానుంది. మురుగు నీటి వ్యవస్థ రంగానికి, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు ఎక్కువగా కేటాయించడంతో జిల్లాలో అండర్ డ్రెయినేజీతో అత్యాధునిక ఆస్పత్రి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– పీవీ.నారాయణరావు, సీఐ, ఎస్‌ఆర్‌టీసీ బ్రాంచ్ సభ్యులు

రూ.2 కోట్ల విలువైన భూమి కబ్జా

● సీపీకి ఫిర్యాదు.. ముగ్గురిపై కేసు

హసన్‌పర్తి: గుండ్ల సింగారం-ముచ్చర్ల ప్రధాన రహదారి పలివేల్పుల శివారులోని సుమారు రూ.2కోట్ల విలువైన భూమి కబ్జాకు గురైంది. ఈభూమి మాజీ 'కుడా' డైరెక్టర్, అధికార పార్టీకి చెందిన నాయకుడు నన్నబోయిన రమేశ్‌యాదవ్ అక్రమించాడన్న వ్యవహారంలో అతడితో పాటు మరో ఇద్దరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పలివేల్పుల శివారులో కడిపికొండకు చెందిన కోతుల కుమారస్వామి 10 గుంటల భూమి కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ ధర గుంటకు రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షలు ధర పలుకుతోంది. అయితే ప్రస్తుతం ఈభూమి ఖాళీగా ఉండడంతో 'కుడా' మాజీ డైరెక్టర్ నన్నబోయిన రమేశ్ యాదవ్ కన్ను పడింది. 207 సర్వే నంబర్ గల భూమిని 133 సర్వే నంబర్‌గా మార్చి రమేశ్ తన తండ్రి బాలయ్య పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇటీవలే భూమిని కరీమాబాద్‌కు చెందిన మేకల వెంకటేశ్‌కు విక్రయించాడు. కొనుగోలుదారుడు భూమిని చదును చేస్తున్న విషయం తెలుసుకున్న బాధితుడు కుమార స్వామి ఘటనా స్థలికి వెళ్లడంతో అతడిని బెదిరించారు. దీంతో అతడు నేరుగా నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనను సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసును సీపీ టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రంగంలోకి దిగింది. ఈమేరకు నన్నబోయిన రమేశ్‌యాదవ్, అతడి తండ్రి బాలయ్యతో పాటు భూమి కొన్న మేకల వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.